# కేసీఆర్‌కే జనం జై

- రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కారుదే జోరు
- స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కే ప్రయోజనం
- ఆరు గ్యారెంటీలు, రుణమాఫీపై గుర్రుగా మహిళలు, రైతులు
- కాంగ్రెస్ అంతర్గత సర్వేలో వెల్లడి
- ఫిరాయింపు నేతల సెగ్మెంట్లలో రహస్యంగా సమాచార సేకరణ



హైదరాబాద్, అక్టోబర్ 20 (హైదరాబాద్): రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు శరవేగంగా మారుతున్నాయా? పది నెలల కాలంలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ప్రజాభిప్రాయం మారుతున్నదా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారని తేలింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ చేయించిన సర్వేలో ఈ విషయమే వెల్లడైనట్టు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7 నాటికి సరిగ్గా ఏడాది అవుతుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై రెఫరెండంగా జనంలోకి వెళ్తే ప్రజల నుంచి వచ్చే స్పందన, రాజకీయంగా తమకు ప్రస్తుతం ఉన్న పట్టుపైన సర్వే నివేదికలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందాన్ని, ఇంటెలిజెన్స్ వర్గాలను ఆదేశించినట్టు తెలిసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై ఒకటి రెండ్రోజుల్లో తీర్పు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ బీ ఫాంపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలందరిలో ఇప్పుడు దడ మొదలైంది. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే పరిస్థితేమిటన్న చర్చ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సంబంధించిన పది నియోజకవర్గాల్లో జరుగుతున్నది. దీనికి తోడు రైతు రుణమాఫీ, మూసీ పునర్జీవం మీద ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్న నేపథ్యంలో ఉప ఎన్నికలకు వెళ్లి ప్రజాక్షేత్రంలో సత్తా చూపితే ఒక్క దెబ్బతో అందరి నోళ్లు మూయించవచ్చనే ఆలోచన చేసినట్టు తెలిసింది. బీఆర్ఎస్ పార్టీ బీ ఫాం మీద గెలిచి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో రహస్యంగా ప్రజాభిప్రాయ సేకరణ చేసే కార్యక్రమాన్ని రేవంత్‌రెడ్డి సర్కా రు చేపట్టినట్టు తెలిసింది. ఈ సర్వేలో విస్తుపోయే ఫలితాలు వచ్చినట్టు ప్రభుత్వంలో కీలకంగా ఉన్నవారే చెప్తున్నారు. గ్రాఫ్ పడిపోతున్నదని, కేవలం పదినెలల పాలనలో ఈ స్థాయిలో గ్రాఫ్ పడిపోవడం గతంలో చూడలేదని, తాము చేయించిన సర్వేలో ఇదే తేలిందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత ఒకరు తెలిపారు. తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఫలితాలు ఊహించని విధంగా వస్తాయని, కేసీఆరే అత్యంత బలవంతుడని తేలిపోతుందని చెప్తున్నారు. అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ పార్టీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమని చెప్తున్నారు. ఆరు గ్యారెంటీలు పూర్తిగా అమలు కాకున్నా, అమలు చేస్తున్న హామీలతో ప్రజల్లో సానుకూలత ఉన్నదని ఇంటెలిజెన్స్ నివేదికలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలకు వెళ్తే ఫలితం అనుకూలంగా ఉంటుందా? ప్రతికూలంగా మారుతుందో తేల్చి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్తను ఆదేశించినట్టు తెలిసింది.

### రహస్యంగా అభిప్రాయ సేకరణ

ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు గద్వాల, భద్రాచలం, స్టేషన్‌ఘన్‌పూర్, జగిత్యాల, బాన్సువాడ, చేవెళ్ల, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో రహస్యంగా తిరిగి ప్రజాభిప్రాయాలు సేకరించినట్టు తెలిసింది. ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, మహిళల నుంచి వివరాలను సేకరించినట్టు తెలిసింది. గ్రామీణ ప్రాంత నియోజకవర్గాల్లో రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నట్టు సమాచారం. మెట్రో పాలిటన్ నగరంలోని నియోజకవర్గాల్లో హైడ్రా, ఎఫ్‌టీఎల్ కూల్చి వేతల మీద ప్రజలు అత్యంత ఆగ్రహంతో ఉన్నారని సర్వే తేల్చినట్టు తెలిసింది. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వద్దకు వెళ్లాల్సిన బాధితులు ప్రభుత్వంపై నమ్మకం లేక ప్రతిపక్షపార్టీ బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు వెళ్లడమే దీనికి అతిపెద్ద నిదర్శనమని చెప్తున్నారు. కొన్ని రోజులుగా తెలంగాణ భవన్‌కు తండోపతండాలుగా ప్రజలు వస్తుండడాన్ని సర్వే బృందాలు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నట్టు విశ్వసనీయ సమాచారం. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన అత్యం త సమర్థంగా పని చేస్తున్నదని, తెలంగాణ భవన్‌కు హైడ్రా, మూసీ బాధితులు, ఆశా వర్కర్లు, ఆటో డ్రైవర్లు, గ్రూప్-1 అభ్యర్థులు క్యూ కడుతున్నట్టు నివేదించారు. నిజానికి వీళ్లంతా సీఎం క్యాంపు కార్యాలయానికి, సచివాలయానికి సీఎంను కలవటానికి వెళ్లాలి కానీ, తెలంగాణ భవన్‌కు వెళ్లి కేసీఆర్ కోసం ఆరా తీస్తున్నారు. ఆయనను ఆరాధిస్తున్నారని సర్వే సంస్థలు నివేదించినట్టు తెలిసింది. సోషల్ మీడియాలో 'కేసీఆర్ మళ్లీ రావాలి' అన్న వాదన పెరిగిందని, పదినెలల పాలనలో రేవంత్‌రెడ్డి సాధించింది శూన్యమని చెప్పినట్టు తెల్సింది. పార్లమెంటు ఎన్నికల వరకు అటు జాతీయ పార్టీగా బీజేపీని, కాంగ్రెస్‌ను చూసిన ప్రజలు ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు చూసి పెదవి విరుస్తున్నట్టు తేలింది. తెలంగాణలో రాజకీయంగా కేసీఆర్ బలంగా ఉంటేనే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఓడిన తరువాత కేసీఆర్ అత్యంత బలంగా మారారని, ఒక రకంగా రేవంత్‌రెడ్డికి రెడ్ అలెర్ట్ సంకేతాలే అందుతున్నాయని సర్వే ఫలితాలు వచ్చినట్టు తెలిసింది. ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలకు వెళ్తే మెజార్టీ ప్రజలు బీఆర్ఎస్‌కే మద్దతు ప్రకటించారని సర్వేలో తేలినట్టు తెలిసింది.

### స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రభావం

రేవంత్‌రెడ్డి సర్కారుపై విపరీతమైన నెగిటివిటీ పెరిగిందని సర్వే సంస్థలు తేల్చిచెప్పినట్టు సమాచారం. గతంలో రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అనుకూలంగా స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు వచ్చేవని కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని రేవంత్‌రెడ్డి కోసం పనిచేసే ఓ మీడియా సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. ఇదే విషయాన్ని ఆయనకు కూడా నివేదించినట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతు భరోసా, రైతు రుణమాఫీ, పింఛన్ల రూపంలో ఇచ్చే మొత్తాలను పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం, రేవంత్‌రెడ్డి నోటికి వచ్చినట్టు మాట్లాడటం, హైడ్రా, మూసీ వంటివాటితో కూల్చివేతలు నిర్వహించడం, అడ్డగోలుగా రుణాలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నాడన్న చర్చ జరుగుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ అత్యధిక చోట్ల గెలుపొందుతుందని నివేదికలు ఇచ్చినట్టు సమాచారం. కేసీఆర్ ఉంటే బాగుండన్న చర్చ గ్రామాల్లో జరుగుతున్నట్టు తేల్చి చెప్పినట్టు తెలిసింది.

## మరో నేత కార్మికుడి బలవన్మరణం

- ఉపాధి కరువై.. బతుకు భారమై
- సిరిసిల్లలో సంపత్ ఆత్మహత్య



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నేత కార్మికుడు ఆడెపు సంపత్ (60) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన సంపత్ మరమగ్గాల పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకపోవడంతో పరిశ్రమలోని సాంచాలు మూతపడ్డాయి. పని కోల్పోయిన సంపత్ అడ్డమీద కూలి పనికివెళ్తున్నాడు. భవననిర్మాణ రంగంలో బరువైన పనులు చేయలేక మానేశాడు. పెద్ద కుమారుడు నాగరాజు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నకొడుకు రాజు ఓ హోటల్‌లో పనికి పోతున్నాడు. భార్య భాగ్య బీడీలు చుడుతున్నది. ఈ క్రమంలో శనివారం రాత్రి అందరూ పడుకున్న తర్వాత దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం చేయూతనివ్వక పోవడంతో నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. నేత కార్మికుల ఆత్మహత్యలకు సర్కారే కారణమని ఆరోపించారు. నేత కార్మికులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని డిమాండ్ చేశారు.

## మంత్రి కొండా సురేఖ ఇల్లు ముట్టడి

- మంత్రి పేరుతో హెడ్‌కానిస్టేబుల్ బెదిరింపులు
- కిరాణ వ్యాపారి ఆత్మహత్య
- మృతదేహంతో కొండా ఇంటి ముందు బైఠాయింపు

సుబేదారి, అక్టోబర్ 20: ఓ హెడ్‌కానిస్టేబుల్ మంత్రి పేరు చెప్పి వేధించడంతో వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండలోని సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలోని గోకుల్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. ఆగ్రహించిన బాధిత కుటుంబ సభ్యులు మృతదేహంతో కొండా సురేఖ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గోకుల్ నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఫైనాన్షియర్‌గా ఉన్న రమేశ్ ఐదేండ్ల క్రితం ఇదే కాలనీకి చెందిన విష్ణుకు రూ.3 లక్షలు అప్పు ఇవ్వగా.. కిరాణం షాపు వ్యాపారి రాంబాబు (52) మధ్యవర్తిగా ఉన్నాడు. అప్పు తీసుకున్న విష్ణు అడ్రస్ లేకుండా పోవడంతో ఉపాధ్యాయుడు రమేశ్ అసహనానికి గురయ్యాడు. దీంతో తన బంధువు సుబేదారి పోలీసు స్టేషన్‌లో ఇంటర్‌సెప్టర్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఉపేందర్‌తో కలిసి రాంబాబును వేధింపులకు గురిచేశారు. కొంత డబ్బు ఇచ్చాక కూడా ఉపేందర్ అతడిని బెదిరిస్తున్నాడు. 'నేను మంత్రి కొండా సురేఖ వద్ద డ్యూటీ చేస్తున్న.. మొత్తం డబ్బులు ఇవ్వాలి.. లేకుంటే కేసు పెట్టి తొక్కిస్తా' అని ఫోన్‌లో బెదిరించడంతో మనస్తాపానికి గురైన రాంబాబు ఈనెల 17న ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగాడు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆగ్రహించిన మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తమకు న్యాయం చేయాలని కోరుతూ రాంబాబు మృతదేహాన్ని హనుమకొండలోని మంత్రి కొండా సురేఖ ఇంటి ముందు ఉంచి కొద్దిసేపు ధర్నా నిర్వహించారు.

# కాంగ్రెస్‌పై ప్రజల్లో తిరుగుబాటు

**మాట తప్పిన పార్టీపై ఇక యుద్ధమే • ప్రజల కోసం ప్రాణాలు సైతం లెక్కచెయ్యం • రేవంత్ తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు**

**6 గ్యారెంటీలిచ్చిన ముగ్గురు గాంధీలేరీ? • మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇచ్చినం**

- భూసేకరణ చట్టం ప్రకారం న్యాయం చేసినం
- మూసీ బాధితులకు మీరేమిచ్చిండ్రు?
- గచ్చిబౌలిలోని 470 ఎకరాలు లే అవుట్ చేసి మూసీ నిర్వాసితులకు ఇవ్వాలి: హరీశ్‌రావు



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో జరిగిన అలయ్ బలయ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి టీ హరీశ్‌రావు

> డబుల్ బెడ్‌రూం ఇల్లు, ఇంటి యజమానికి రూ.7.50 లక్షలు, 18 ఏండ్లు నిండిన వారికి 250 గజాల ప్లాటు, పెండ్లికాని అమ్మాయిలకు రూ.5లక్షల చొప్పున మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్వాసితులకు ఇచ్చినం. మల్లన్న సాగర్ నిర్వాసితులకు కేసీఆర్ అన్యాయం చేసిండని రేవంత్‌రెడ్డి సిగ్గులేకుండా మాట్లాడుతున్నడు. ఎలాంటి పరిహారం ఇవ్వకుండా మూసీ బాధితులను బలవంతంగా వెళ్లగొడుతున్నది మీరు కాదా? అన్యాయం మల్లన్నసాగర్‌లో జరిగిందా? మూసీలో జరిగిందా?
> 
> - హరీశ్‌రావు

కరీంనగర్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ)/గజ్వేల్ : మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇక ప్రజాయుద్ధం చేయాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు గ్యారెంటీల గారడీ చూపించి, బాండ్ పేపర్లు పంచి ఇప్పుడు వాటి అమలు మర్చిపోయారని, ఆరు గ్యారెంటీల హామీలిచ్చిన రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, సోనియా గాంధీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల ఉసురు పోసుకుంటున్నాడని, మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను అన్యాయంగా కూలుస్తున్నాడని ధ్వజమెత్తారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని సాయిరాం గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అధ్యక్షతన ఆదివారం జరిగిన బీఆర్ఎస్ అలయ్.. బలయ్ సభ, గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. డిసెంబర్ 9న రుణమాఫీ అని, వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 13 హామీలు నెరవేర్చుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 300 రోజులు దాటుతున్నా ఏ ఒక్కటీ అమలు చేయలేదని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, వారిని ముందుండి నడపాల్సిన బాధ్యతను బీఆర్ఎస్ కార్యకర్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు అమలు చేసిన అనేక పథకాలను తెలంగాణ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, పథకాలు పంచే కేసీఆర్‌ను వదులుకొని ఫొటోలకు ఫోజులిచ్చే రేవంత్‌రెడ్డిని తెచ్చుకున్నామని బాధపడుతున్నారని చెప్పారు.

> మూసీ సుందరీకరణ పనులకు అడ్డొస్తే నన్ను, కేటీఆర్‌ను బుల్డోజర్ కింద వేసి చంపేస్తానని రేవంత్‌రెడ్డి అంటున్నడు.. చావడానికైనా సిద్ధంగా ఉన్నాం తప్ప, తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదు. ప్రాణాలకు భయపడేటోళ్లమే అయితే కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేటోళ్లమే కాదు.
> 
> - హరీశ్‌రావు

### ఉన్న రైతుబంధు కూడా పోయింది

రైతుబంధు ఇప్పుడైతే రూ.10 వేలు, రేపైతే రూ.15 వేలు అని కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలను రైతులు నమ్మారని, ఉన్న రైతుబంధు రద్దయితదని వాళ్లు కలలో కూడా అనుకోలేదని హరీశ్ తెలిపారు. వరుసగా రెండేళ్లు కరోనా వచ్చినా, ప్రభుత్వానికి రూపాయి ఆదాయం లేక పోయినా రైతులకు సమయానికి కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని గుర్తుచేశారు. రైతుభరోసా పేరుతో రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పెట్టిన రూ.10 వేలైనా ఇవ్వలేక పోయిందని ఎద్దేవా చేశారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వస్తే నిలదీసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 11 విడతల్లో రూ.72 వేల కోట్లు రైతుబంధు ఇచ్చామని, ఇప్పుడు ఒక్క విడత ఇవ్వడానికే రేవంత్‌రెడ్డికి ముక్కులకు వస్తదెట్లా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి అనేది చాలా స్పష్టంగా తెలుస్తున్నదని దుయ్యబట్టారు. రైతులు సంఘటితమై పోరాడకుంటే యాసంగికి కూడా రైతుభరోసా ఇచ్చే పరిస్థితి లేదని చెప్పారు. బీఆర్ఎస్ పథకాలన్నింటినీ నిలిపి వేస్తున్నారని, మహిళలకు రూ.2,500 ఇవ్వలేదని, ఈ పది నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి మహిళకు రూ.25 వేలు బాకీ పడిందని, ఈ విషయాన్ని ప్రతి మహిళకు బీఆర్ఎస్ కార్యకర్తలు చెప్పాలని సూచించారు. బతుకమ్మ పండుగకు రెండు చీరలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, రేవంత్‌రెడ్డి మోసాన్ని మహిళలే గ్రహిస్తున్నారని చెప్పారు. ఆసరా పింఛన్లు రూ.4 వేలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి పది నెలల్లో రెండు నెలల పింఛన్లు ఎగవేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ఏ ఒక్క మాట మీద నిలబడ లేదని నిప్పులు చెరిగారు. ఎన్నికల ముందు అన్ని రకాల పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ అని, ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయిస్తేనే ఇస్తామని చెప్తున్నారని, రైస్ మిల్లర్లే సన్న వడ్లను రూ.3 వేలకు క్వింటాలు చొప్పున కొనుక్కుపోతున్నారని, అంటే బోనస్ కూడా ఎగవేసే పరిస్థితిలోనే ప్రభుత్వం ఉన్నదని స్పష్టంచేశారు.

> ముఖ్యమంత్రి తన పేరు మార్చుకోవాలి.. ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు, ఎగవేతల రేవంత్‌రెడ్డి అని ఇప్పటి నుంచి పిలుస్తం. చీఫ్ మినిస్టర్‌గా పిలిపించుకోదల్చుకున్నవా? చీటింగ్ మ్యాన్‌గా పిలిపించుకోదల్చుకున్నావా? రేవంత్‌రెడ్డే తేల్చుకోవాలి.
> 
> -హరీశ్‌రావు



మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకుంటున్న హరీశ్‌రావు

### దేవుళ్లనే మోసం చేసిన సీఎం

కాంగ్రెస్ వచ్చిన తర్వాత మళ్లీ కరెంట్ కష్టాలు మొదలయ్యాయని, మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలుతున్నాయని హరీశ్ మండిపడ్డారు. రుణమాఫీ పూర్తయ్యింది రాజీనామా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి తనకు సవాల్ విసిరిన విషయాన్ని గుర్తు చేసిన హరీశ్‌రావు, మానకొండూర్ నియోజకవర్గంలో ఏగ్రామానికి వస్తావో రమ్మని, ఒక్క ఊరిలోనైనా రుణమాఫీ పూర్తయ్యిందని నిరూపించగలవా? అని సవాల్ విసిరారు. దేవుళ్లనే మోసం చేసిన సీఎంను రేవంత్‌రెడ్డినే చూస్తున్నామని మండిపడ్డారు. మహిళలకు ఒక్క బస్సు తప్ప అంతా తుస్సేనని, ఆ బస్సు కూడా ఆగమాగమే ఉన్నదని ఎద్దేవాచేశారు.

### యువతను వీపులు పగిలేలా కొడుతున్నరు

నిరుద్యోగ యువతను టెర్రరిస్టులు, దొంగలు, బందిపోట్లు, నక్సలైట్లను కొట్టినట్టు కొడుతున్నారని, వీపులు కమిలిపోయేలా కొడుతున్నారని, ఆడపిల్లలని కూడా చూడకుండా అర్ధరాత్రి వ్యాన్లలో తీసుకెళ్లి పోలీసు స్టేషన్లలో పెడుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ పిల్లలు మన తెలంగాణ పిల్లలుకారా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ అశోక్‌నగర్ సెంట్రల్ లైబ్రరీకి వెళ్లి కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నమ్మించి మోసం చేశారని నిప్పులు చెరిగారు. కేసీఆర్ నోటిఫై చేసిన 30 వేల ఉద్యోగాలను తామే ఇచ్చామని చెప్పుకొంటూ ఫోజులు కొడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డికి దమ్ముఉంటే ఎలాంటి సెక్యూరిటీ లేకుండా అశోక్‌నగర్ రావాలని సవాల్ విసిరారు.

### ఎవరిని ఉద్ధరించేందుకు మూసీ?

కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 38 లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీళ్లిచ్చామని, రూ.93 వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేశారని, 38 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93 వేల కోట్లు ఖర్చయితే తప్పని అంటున్నారని, మూసీ సుందరీకరణకు మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడతానని అంటున్నారని, ఇది ఎవరిని ఉద్ధరించేందుకని హరీశ్ ప్రశ్నించారు. ఆ సుందరీకరణ వెనుక ఉన్న మర్మం ఏమిటో ప్రజలకు అర్థమైందని స్పష్టంచేశారు. సంక్షేమ పథకాలకు లేని పైసలు మూసీ సుందరీకరణకు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. హామీల అమలుపై ప్రజలు నిలదీస్తారనే ఉద్దేశంతోనే మూసీ సుందరీకరణ పేరుతో రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాలపై తాము ప్రశ్నిస్తే వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని, నిందలు వేస్తున్నారని, అరెస్టులకు కుట్రలు చేస్తున్నారని చెప్పారు.

### రేవంత్‌రెడ్డేం పర్మినెంట్ కాదు..

ఏనాడూ అమరుల స్తూపానికి శ్రద్ధాంజలి ఘటించని రేవంత్‌రెడ్డి తప్పిదారి సీఎం అయ్యాడని హరీశ్ దుయ్యబట్టారు. అధికార పార్టీ మెడలు వంచడం ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ హక్కు అని, ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిర్వర్తిస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరిస్తున్నారని, పోలీసులు చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. తేడా వస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు పెద్ద అధికారులు కూడా జైల్లో ఊచలు లెక్కిస్తున్నారని, రేవంత్‌రెడ్డి ఏం పర్మినెంట్ కాదని, అతిగా ప్రవర్తించినా, అన్యాయంగా కేసులు పెట్టినా, బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించినా రేపు పోలీసులు కూడా విచారణ ఎదుర్కోవాల్సి వస్తుంది జాగ్రత్త అని హెచ్చరించారు. 'మనం చేసేది న్యాయమైన, ధర్మమైన, ప్రజల పక్షాన చేసే పోరాటం.. రైతులు, నిరుద్యోగులు, పేదల పక్షాన పోరాడుతున్నం.. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి' అని హరీశ్ సూచించారు.

### మెరుగైన పరిహారం ఇచ్చినం

2013 భూసేకరణ చట్టం ప్రకారం మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందించామని, దేశంలోనే ఎక్కడా లేని విధంగా అద్భుతమైన కాలనీలను ముట్రాజ్‌పల్లి, సంగాపూర్, తునికిబొల్లారంలో కేసీఆర్ నిర్మించారని హరీశ్‌రావు స్పష్టంచేశారు. మూసీ బాధితులకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండా బలవంతంగా పంపిస్తున్నది మీరుకాదా? అని ప్రశ్నించారు. 675 ఎకరాల్లో సింగిల్ లే అవుట్ వేసి దేశంలోనే అతి పెద్ద కాలనీని ముట్రాజ్‌పల్లిలో నిర్మించి అండగా నిలబడింది కేసీఆర్ అని గుర్తుచేశారు. సోనియాగాంధీ తెచ్చిన 2013 భూసేకరణ చట్టం ప్రకారమే 121 గజాల్లో ఇంటిని ఏడెనిమిది లక్షలతో నిర్మించి ఇచ్చామని చెప్పారు. మొత్తం 3,414 ఇండ్లు నిర్మించగా ముట్రాజ్‌పల్లిలో 2,273, తునికిబొల్లారంలో 1,141 ఇండ్లను కట్టి చేతి ఖర్చులకు రూ.50వేల చొప్పున ఇచ్చి గృహ ప్రవేశాలు చేయించామని తెలిపారు. 8 వేల మందికి 250 గజాల ఇంటి స్థలం, నిర్మాణాలకు రూ.5లక్షలు, పెండ్లి కాని అమ్మాయిలకు రూ.5లక్షలు, బ్రహ్మాండమైన ఇండ్లను నిర్మించి ఇచ్చింది నిజం కాదా? అని నిలదీశారు. కేసీఆర్ ఇచ్చిన ప్లాటు విలువ అప్పుడు రూ.25లక్షల నుంచి రూ.30 లక్షలుంటే ఇప్పుడు కాంగ్రెస్ వచ్చినంక తగ్గిందని, రియల్ ఎస్టేట్ వ్యాపారం రాష్ట్రంలో ఆగమయిందని చెప్పారు. ప్రతి ఇంటికి సుమారు కోటి వరకు సాయం చేశామని మీరు ఇవ్వాలనుకుంటే మరో రూ.50 లక్షల సాయం చేయాలని, పూల దండలతో స్వాగతించి శాలువా కప్పుతామని చెప్పారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి రూ.2000 కోట్లు వెచ్చించామని తెలిపారు. 'ఆనాడు ప్రాజెక్టులను అడ్డుకొని కేసులు వేయించిన మీకు చేతనైతే డబుల్, ట్రిపుల్ పరిహారం బాధితులకు ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్‌లో కేసీఆర్ ఇచ్చిన దాంట్లో మూసీ బాధితులకు రేవంత్‌రెడ్డి 10 పైసల సాయం కూడా చేయలేదని దుయ్యబట్టారు. తునికిబొల్లారంలో 180 ఎకరాల్లో రూ.20 కోట్లతో కాలనీ ఏర్పాటు చేసి 1,141ఇండ్లు నిర్మించామని చెప్పారు. 400 ఎకరాల్లో ఏర్పాటైన పరిశ్రమల్లో వెయి మందికి ఉపాధి దొరికిందని తెలిపారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం వర్గల్‌లో 1100 ఎకరాలు సేకరిస్తే కాంగ్రెస్ ఎన్‌జీటీలో కేసులు వేయించి పరిశ్రమలను అడ్డుకొని బ్లాక్ మెయిల్ చేస్తున్నదని మండిపడ్డారు. మూసీ బాధితులకు గచ్చిబౌలిలోని 470 ఎకరాల విస్తీర్ణంలో అద్భుతమైన లే అవుట్ చేసి 250 గజాల్లో డబుల్ బెడ్ రూం ఇండ్లు, గుడి, బడి, మజీద్, చర్చిలను కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు బోయినపల్లి వినోద్ కుమార్, జీవీ రామకృష్ణారావు, సర్దార్ రవీందర్‌సింగ్, నారదాసు లక్ష్మణ్‌రావు, సిద్ధం వేణు, గడ్డం నాగరాజు, రావుల రమేశ్, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, శివకుమార్, దేవీ రవీందర్, బెండె మధు, జకీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

> పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నం. చంపుతం.. కేసులు పెడుతం.. అక్రమంగా అరెస్టులు చెస్తం అని బెదిరిస్తే బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడేటోళ్లు కాదు. నీ తాటాకు చప్పుళ్లకు బెదిరేవాళ్లెవరూ లేరు. పేదలకు అన్యాయం జరిగితే ఎదిరించేందుకు దేనికైనా సిద్ధపడ్డం. రేవంత్‌రెడ్డిని విడిచేది లేదు.. ఆయన వెంట పడుతం. వైఎస్, కిరణ్‌కుమార్‌రెడ్డితో కొట్లాడినోళ్లం.. సమైక్యాంధ్రలో కర్కశ కాంగ్రెస్‌తో కొట్లాడినోళ్లం.. ఈ రేవంత్‌రెడ్డితో కొట్లాడలేమా?
> 
> - హరీశ్‌రావు

## జనాభా ప్రకారం బీసీలకు సీట్లు దక్కాల్సిందే

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో అభివాదం చేస్తున్న మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, జాజుల తదితరులు

ఖైరతాబాద్, అక్టోబర్ 20 : దేశం ఏ ఎన్నికలు జరిగినా జనాభాకు అనుగుణంగా బీసీలకు సీట్లు దక్కాల్సిందేనని వక్తలు డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నా బీసీల ఓట్లే ప్రధానమని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే సమగ్ర కులగణన చేస్తామని, 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఆలస్యం చేసిందని, ఇకనైనా వెంటనే ఆ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కేవలం స్థానిక సంస్థలకే కాకుండా ఇక నుంచి రాష్ట్రంలో ఏ ఎన్నికల్లోనైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. స్వాతంత్య్రం సిద్ధించిన నాటి నుంచి రాజ్యాంగం ప్రసాదించిన ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం బీసీలకు వర్తించడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత వీ హన్మంతరావు బీసీ అయినందుకే ఆయనకు సరైన రాజకీయ ప్రాధాన్యం లభించలేదని, ఆయన అగ్రకులంలో పుట్టి ఉంటే ఎప్పుడో ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యేవారని తెలిపారు. బీసీల హక్కుల కోసం పోరాడేవారికి బీఆర్ఎస్ బాసటగా నిలుస్తుందని స్పష్టంచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. కులగణన దేశవ్యాప్తంగా జరుగాలని, ప్రధాని మోదీ నిజమైన బీసీ అయితే వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శాసన మండలి ఉప చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన అడ్‌హాక్ కమిటీ సభ్యులు

## డిజిటల్ సర్వేపై పునరాలోచించాలి

- వ్యవసాయ విస్తరణాధికారుల డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ)/మేడ్చల్: డిజిటల్ క్రాప్ సర్వేపై ప్రభుత్వం పునరాలోచించాలని ఏఈవోలు డిమాండ్ చేశారు. 2,100 మంది ఏఈవోలు నియమితులై ఏడేండ్లు పూర్తయిన నేపథ్యలో ఆదివారం శామీర్‌పేట్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఏడేండ్లలో విధి నిర్వహణలో ఎదురైన అనుభవాలను చర్చించుకున్నారు. అనంతరం అడ్‌హాక్ కమిటీని ఏర్పాటుచేసుకున్నారు. చైర్మన్‌గా రాజ్‌కుమార్ బాదావత్, కన్వీనర్లుగా పంజాల రాజు, కల్లెపల్లి పరశురాం, బందెల సుమన్, కల్యాణితో 32 జిల్లాల కో కన్వీనర్లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ విధినిర్వహణలో ఇప్పటికే అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అష్టకష్టాలు పడుతూ 49 రకాల సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ తరుణంలో తమను ప్రభుత్వం డిజిటల్ సర్వే చేయాలనడం సరికాదన్నారు.